సాక్షి
రంగారెడ్డి

ఆదివారం । 13 । ఏప్రిల్ । 2025



మీర్‌పేట: మందమల్లమ్మ చౌరస్తాలో ర్యాలీ



మొయినాబాద్: వీర హనుమాన్ శోభాయాత్ర

జై హనుమాన్

రామ లక్ష్మణ జానకీ... జై బోలో హనుమాన్‌కీ.. జై భజరంగ్‌భళీ.. జై శ్రీరామ్.. నినాదాలు హోరెత్తాయి.. ఊరూ, వాడా కాషయ జెండాలు రెపరెపలాడాయి.. హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం జిల్లాలోని హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పల్లెలు, పట్టణాలు తేడా లేకుండా పెద్ద ఎత్తున శోభాయాత్రలు చేపట్టారు. యువకులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.



కందుకూరు: చౌరస్తాలో కొనసాగుతున్న శోభాయాత్ర

న్యూస్‌రీల్

భద్రాచలం సీతారాముల కల్యాణ తలంబ్రాలు పంపిణీ



భక్తులకు భద్రాచలం తలంబ్రాలను అందిస్తున్న వీబీఓలు

చేవెళ్ల: ప్రజల వద్దకు సేవలను మరింత చేరువ చేసేందుకు ఆర్టీసీ కృషి చేస్తోందని విలేజ్ బస్సు అధికారులు (వీబీఓలు) ఎ.రవీందర్, సి.బాల్‌రాజ్ అన్నారు. భద్రాచలం సీతారాములు కల్యాణ తలంబ్రాలకోసం ముందుగా బుక్ చేసుకున్న చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి మండలాల్లోని ప్రజలకు శనివారం వీబీఓలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భద్రాచలం సీతారాములు కల్యాణ తలంబ్రాలు కావాలనుకునేవారు ఆర్టీసీ కార్గో సేవల ద్వారా బుక్ చేసుకోవాలని ఆయా మండలాల్లో ముందుగా ప్రచారం చేసినట్లు చెప్పారు. అప్పుడు బుక్ చేసుకున్నవారికి భద్రాచలం నుంచి కార్గో సర్వీస్ ద్వారా ప్యాకింగ్‌లో వచ్చిన తలంబ్రాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ సేవలను విస్తరించేందుకు ప్రతి ఏడాది ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. సేవలపై జనం హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు.

అవినీతి నిర్మూలనకు నడుం బిగించాలి

మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



అతిథులకు జ్ఞాపికల అందజేత

మహేశ్వరం: అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మొహబ్బత్‌నగర్ గ్రామ పరిధిలోని అవేర్ సంస్థలో శనివారం 'అవినీతి– న్యాయవ్యవస్థ' అంశంపై బీఈడీ విద్యార్థులకు నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. అవినీతి దేశాభివృద్ధికి చాలా ప్రమాదకరమైందని, దానిని కూకటివేళ్లతో పెకిలించాలని అన్నారు. తెలంగాణలో గత పాలకులు చేసిన తప్పులే ప్రస్తుత పాలకులు చేస్తున్నారన్నారు. గతంలో చేసిన అవినీతి తప్పిదాలు పునరావృతం కాకూడదన్నారు. డబ్బుతో ప్రజాస్వామ్యం, ఓట్లను ఎప్పుడూ కొనలేరన్నారు. యువత అవినీతి నిర్మూలనకు నడుం బిగించాలని ఆయన పిలుపునిచ్చారు. గిరిజనులు, దళితులు, ఆదివాసీలు, పేద విద్యార్థుల సంక్షేమం కోసం అవేర్ సంస్థ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. అంతకు ముందు ప్రముఖ న్యాయవాదులు, ప్రొఫెసర్లు అవినీతి – న్యాయవ్యవస్థ అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రైబల్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్, అవేర్ సంస్థ చైర్మన్ మాధవన్‌జీ, డైరెక్టర్ రాజవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

వరదల నివారణకు ముందస్తు చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ ఎన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ, వర్షాల్తోస్తే నగరంలో ముంపు సమస్యలు తగ్గడం లేదు. రోడ్లు, కాలనీలు, బస్తీలు చెరువులుగా మారే పరిస్థితి తప్పడం లేదు. వ్యూహాత్మక నాలా అభివృద్ధి పథకం (ఎస్ఎన్‌డీపీ) ద్వారా వరద కాల్వల విస్తరణ, ఆధునికీకరణ పనులతో సమస్యలు కొంత మేర తగ్గినా, పూర్తిగా పరిష్కారం కాలేదు. ఈ నేపథ్యంలో వర్షాలకు ముందస్తుగానే తగిన చర్యలు తీసుకుంటే నష్టాన్ని నివారించవచ్చనే ఆలోచనలో ఉన్న జీహెచ్‌ఎంసీ వాతావరణ శాఖ, టీజీడీపీఎస్‌లతో కలిసి సమన్వయంతో పని చేయాలని భావిస్తోంది. నగరంలో ఏయే ప్రాంతాల్లో వర్షాలు కురియనున్నాయో.. ఎంతమేర కురియనున్నాయో ముందుగానే తెలిస్తే.. అక్కడ అవసరమైన యంత్రాంగాన్ని మోహరించడం, వరద కట్టడికి చర్యలు తీసుకోవడం వంటివి చేయొచ్చని జీహెచ్‌ఎంసీ భావిస్తోంది. వర్షాల్లో తలెత్తే పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఇరవై నాలుగు గంటలు పనిచేసే కంట్రోల్ రూమ్‌ను కూడా అందుబాటులోకి తేవాలని భావిస్తోంది. సంబంధిత రెయిన్ సెన్సర్ల ద్వారా వర్షపాతాన్ని పర్యవేక్షిస్తూ, తగిన విధంగా ప్రతిస్పందిస్తూ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవడానికి వీలుంటుంది. కంట్రోల్ రూమ్ ఏర్పాటుతో పాటు వర్షాకాలంలో సమస్యల పరిష్కారానికి మరికొన్ని ఏర్పాట్లు కూడా చేసుకోవాలనే యోచనలో అధికారులున్నారు. వీటికి దాదాపు రూ. 50 కోట్లు ఖర్చు కావచ్చని అంచనా. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిసింది. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ఏర్పాటు చర్యలు చేపట్టనున్నారు. ఎటొచ్చీ రాబోయే వర్షాకాలం లోగా ఇవి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

వికాసానికి ఆటంకం

రాజీవ్ యువవికాసం దరఖాస్తుకు సర్వర్ సమస్య

- ఈ నెల 14తో ముగియనున్న గడువు
- వరుస సెలవులు, రెవెన్యూ కార్యాలయాలు బంద్
- అభ్యర్థులకు తప్పని ఇబ్బందులు



కొందుర్గులోని మీసేవ వద్ద దరఖాస్తు కోసం నిరీక్షణ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రాజీవ్ యువ వికాసం దరఖాస్తుకు వరుస సెలవులు అడ్డంకిగా మారాయి. మీసేవ కేంద్రాల్లో అప్లికేషన్ ఓపెన్ చేసి, వాటిలో అన్ని వివరాలు నమోదు చేసి తీరా ఫైల్‌ను సబ్మిట్ చేసే సమయంలో సర్వర్ డౌన్ అవుతుండటం తలనొప్పిగా మారింది. వివరాలన్నీ నమోదు చేసిన దరఖాస్తును తీరా సమర్పించిన తర్వాత అప్లికేషన్ ఫాం మళ్లీ డౌన్‌లోడ్ కాకపోవడం, మళ్లీ వివరాలన్నీ నమోదు చేసి, సబ్మిట్ చేస్తే.. ఆల్‌రెడీ సబ్మిట్ అయినట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తుండడం ఇబ్బందిగా మారింది. ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని భావించే యువతీయువకులకు తిప్పలు తప్పడం లేదు.

రూ.4 లక్షల వరకు ఆర్థిక సాయం

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకానికి శ్రీకారం చుట్టింది. నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతీయువకులకు స్వయం ఉపాధి కల్పనలో భాగంగా పాన్‌షాపు మొదలు.. కుట్టు మిషన్, పాలడెయిరీ, పేపర్ ప్లేట్స్ తయారీ, సిమెంట్ ఇటుకల తయారీ, లేడీస్ కార్నర్, లాండ్రీషాప్, డ్రైక్లీనర్, టెంట్ హౌస్, మీసేవ కేంద్రం, జిరాక్స్ సెంటర్, ఐస్‌క్రీం, కిరాణ, ఐరన్, సిమెంట్ రిటేల్ వ్యాపారం, గన్నీ బ్యాగ్స్, గిఫ్ట్ ఆప్టికల్ తయారీ, ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ రిపేర్ సెంటర్, టిఫిన్ సెంటర్స్, హోటల్స్, ఏసీ రిపేర్ సెంటర్స్, ఆటో రిక్షా, చికెన్ సెంటర్, సెల్‌ఫోన్ రిపేర్ సెంటర్, కార్పెంటర్, గోల్డ్‌స్మిత్ వర్క్, డీటీహెచ్ సర్వీసులు ఇలా మొత్తం 304 అంశాల్లో కనిష్ఠంగా రూ.50 వేల నుంచి గరిష్ఠంగా రూ.4 లక్షల వరకు ఆర్థిక సాయం అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. జిల్లా నుంచి అనేక మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్ కేంద్రాలకు క్యూ కడుతున్నారు.

సర్వర్ డౌన్‌తో తిప్పలు

దరఖాస్తుకు పాన్‌కార్డు సహా ఆధార్, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి చేసింది. వరుస సెలవుల కారణంగా రెవెన్యూ ఆఫీసులు పని చేయకపోవడం, ఈ నెల 14తో దరఖాస్తు గడువు ముగియనుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకుని ఆన్‌లైన్ కేంద్రాలకు చేరుకుంటే.. తీరా సర్వర్ డౌన్ ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో ఆయా కార్పొరేషన్ల ద్వారా ఇప్పటికే లక్షకుపైగా దరఖాస్తులు అందగా, మరో లక్ష మందికిపైగా నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. దరఖాస్తుకు పాన్‌కార్డు సహా ఆదాయ ధ్రువీకరణ పత్రం అవసరం లేదని, కేవలం రేషన్‌కార్డు ఉంటే సరిపోతుందని జిల్లా అధికారులు చెబుతున్నప్పటికీ.. ఆన్‌లైన్ దరఖాస్తులో ఆయా ధ్రువీకరణ పత్రాల అప్‌లోడ్ తప్పనిసరిగా మారింది. ఆయా పత్రాలు లేకుండా నేరుగా దరఖాస్తు చేస్తే వాటిని స్వీకరించడం లేదు. దీంతో అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారు.

తరచూ మొరాయిస్తోంది



బీసీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ యువతకు అందించే స్వయం ఉపాధి పథకంలో భాగంగా బేకరీ ఏర్పాటు చేయాలని భావించాను. ఆధార్, పాన్, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు సేకరించేందుకు ఇప్పటికే చాలా శ్రమించాల్సి వచ్చింది. వాటిని తీసుకుని మీసేవ కేంద్రానికి వెళ్లి దరఖాస్తు ఫాంలో వివరాలన్నీ నమోదు చేస్తే.. తీరా సబ్మిట్ కావడం లేదు. మళ్లీ అప్లికేషన్ ఓపెన్ చేసి వివరాలు నమోదు చేస్తే.. ఆల్‌రెడీ దరఖాస్తు చేసినట్లు చూపిస్తోంది. అప్లికేషన్ నంబర్ కానీ ప్రింట్ కానీ రావడం లేదు.

– శ్రీనివాస్ నిమ్మనగోటి

కన్నేసి.. కబ్జాకు యత్నించి!

- ప్రభుత్వ భూమి ఆక్రమణకు యత్నం
- వరుస సెలవుల నేపథ్యంలో ప్రీకాస్ట్ వాల్ నిర్మాణం
- అడ్డుకున్న రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు



కబ్జాకు యత్నించిన ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మొయినాబాద్: రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమిపై కబ్జాకోరులు కన్నేసారు. ఆక్రమణకు విఫలయత్నం చేశారు. వరుసగా మూడు రోజులపాటు సెలవులు ఉండటంతో ఇదే అదనుగా ఏకంగా ప్రీకాస్ట్ వాల్ నిర్మాణ పనులు మొదలు పెట్టారు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు, సిబ్బందితోపాటు గ్రామస్తులు ఘటనా స్థలానికి వెళ్లి అడ్డుకున్నారు. ఈ ఘటన మండల పరిధిలోని తోలుకట్ట రెవెన్యూలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తోలుకట్ట రెవెన్యూలోని సర్వేనంబర్ 143లో ఉన్న ప్రభుత్వ భూమిని గతంలో ప్రభుత్వం పేదలకు అసైన్డ్ చేసింది. కొంతమంది రైతులు అప్పట్లో ఇతరులకు విక్రయించినట్లు గుర్తించిన అధికారులు 2000 సంవత్సరంలో పీఓటీ చట్టం కింద వాటిని తిరిగి స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి పక్కనే ఉన్న విలువైన ప్రభుత్వ భూములపై కబ్జాదారుల కన్నుపడింది. 1968లో వేలంపాటలో 5 ఎకరాలు కొన్నట్లు తప్పుడు పత్రాలు సృష్టించారు. ఆరేడేళ్లుగా కబ్జాచేసేందుకు విఫల ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో ఓసారి ఫెన్సింగ్ వేయడంతో రెవెన్యూ అధికారులు తొలగించారు. కొంత కాలానికి కడీలు పాతడంతో వాటిని సైతం తీసివేశారు. రెండేళ్ల క్రితం ప్రీకాస్ట్ వాల్ నిర్మాణం చేపడట్టడంతో కూల్చివేశారు. తాజాగా శనివారం మరోసారి ప్రీకాస్ట్ వాల్ నిర్మాణానికి పూనుకోగా గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఆర్ఐ రాజేష్, రెవెన్యూ సిబ్బంది అక్కడికి చేరుకుని అడ్డుకునే ప్రయత్నం చేయగా కబ్జాదారులు బెదిరింపులకు దిగారు. గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి భూమికి సంబంధించి ఏమైనా పత్రాలుంటే తేవాలని చెప్పి వారిని అక్కడి నుంచి పంపించారు. ఈ భూమి విలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.30 కోట్లకు పైనే ఉంటుంది. విషయాన్ని చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ కలెక్టర్ నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కాగా, ప్రభుత్వ భూమి కబ్జా యత్నంలో పెద్దల హస్తం ఉన్నట్లు తెలుస్తోంది.

తహసీల్దార్‌పై కోర్టు ధిక్కరణ కేసు

తోలుకట్టలోని 143 సర్వే నంబర్‌లో 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జాచేసే ప్రయత్నం చేస్తున్న వ్యక్తి మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌పై కోర్టు ధిక్కరణ కేసు పెట్టారు. కోర్టును సైతం తప్పుదోవ పట్టించారు. తప్పుడు పత్రాలతో కోర్టు నుంచి స్టే తీసుకుని తహసీల్దార్‌పై కోర్టు ధిక్కరణ కేసు పెట్టారు.

పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. శనివారం సాయంత్రం చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి భీం భరత్, టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీసతీష్, పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య, మాజీ సర్పంచ్ సత్యనారాయణ తదితరులు అక్కడికి చేరుకుని స్థానికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

యునెస్కో క్లబ్ వేడుకలు నేడు

సాక్షి, సిటీబ్యూరో: యునెస్కోకు అనుబంధంగా పని చేస్తున్న యునెస్కో క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సాంస్కృతిక వేడుకలను నిర్వహించనున్నట్లు క్లబ్ దక్షిణ భారత ప్రాంతీయ సమన్వయకర్త రామనాథం పరమేశ్వర్‌రావు తెలిపారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు అబిడ్స్ ప్రభాత్కర్ బిల్డింగ్‌లో జరిగే ఈ కార్యక్రమంలో సమాజానికి విశిష్ట సేవలు అందజేసిన వారికి గోల్డెన్ కపుల్ అవార్డులను, విశిష్ట సేవా పురస్కారాలను అందజేయనున్నారు. ఈ కార్యక్రమానికి మధ్యప్రదేశ్ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి పరికిపండ్ల నరహరి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. కేంద్ర ప్రభుత్వ సలహాదారు డా.కేఎల్.రమేష్, భారత యునెస్కో క్లబ్స్ సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి యోగేష్ కులశ్రేష్ఠ, భారత అవయవ దాతల సంఘం అధ్యక్షురాలు గూడూరి సీతా మహాలక్ష్మి పాల్గొంటారు.

ఎన్నికలేవైనా బీఆర్‌ఎస్‌దే గెలుపు

మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సబితారెడ్డి

మొయినాబాద్: రాష్ట్రంలో త్వరలో ఉప ఎన్నికలు వస్తాయి.. ఆ తరువాత స్థానిక సంస్థల ఎన్నికలు వస్తాయి.. ఏ ఎన్నికలు వచ్చినా బీఆర్‌ఎస్ గెలుపు తథ్యమని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. మొయినాబాద్‌లోని స్టార్ కన్వెన్షన్‌లో శనివారం చేవెళ్ల నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ ఎన్నికలొచ్చినా బీఆర్‌ఎస్‌నే గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఇప్పటికే కేసీఆర్‌ను దూరం చేసుకున్నామని ప్రజలు బాధపడుతున్నారని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి ఏడాదిన్నర పాలనలో రెండు సార్లు రైతు బంధు ఎగ్గొట్టారన్నారు. మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మోసం చేసిన రేవంత్‌రెడ్డి పాలనపై ప్రజలకు వివరించాలన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభ ఈ నెల 27న వరంగల్‌లో పెద్ద ఎత్తున జరుగుతుందని.. 10 లక్షల మంది హాజరుకాబోతున్నారన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి సభకు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నలుగురు వృద్ధ మహిళలు వరంగల్ సభకోసం తమ పింఛన్ నుంచి రూ.5వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, కొత్త నర్సింహారెడ్డి, దేశమొల్ల ఆంజనేయులు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు స్వప్న, డీసీసీబీ చైర్మన్ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అవినాష్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాకేదీ 'భరోసా'!



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

- జాబ్‌కార్డు ఉంటేనే ఆత్మీయ భరోసా పథకానికి అర్హులు
- కొత్తగా మంజూరు చేయని ప్రభుత్వం
- ఇన్‌యాక్టివ్‌గా ఉన్నవి యాక్టివ్ కాని వైనం
- కార్యాలయాల చుట్టూ కూలీల ప్రదక్షిణలు

కేశంపేట: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు ఉపాధి కల్పించి వలసలను నివారించాలనే సదుద్దేశంతో కేంద్రం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ఆగస్టు 2005లో ప్రారంభించింది. గ్రామాల్లో పని కావాలని కోరిన నిరుపేద కుటుంబాలకు ఈ పథకం ద్వారా సంవత్సరానికి 100 రోజుల పని కల్పించి, రోజువారీ కనీస వేతనం అందిస్తారు. పని కోసం దరఖాస్తు చేసుకున్న కూలీలకు పని కల్పించకపోతే నిరుద్యోగభృతి అందించేలా అప్పట్లో కేంద్ర ప్రభుత్వం చట్టం రూపొందించింది. గ్రామీణ ప్రాంతాల్లో ధనిక, బీద వ్యత్యాసాలను తగ్గించాలన్నదే లక్ష్యం. ఇంతవరకు బాగానే ఉన్నా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన ఆత్మీయ భరోసా పథకంతో కూలీలకు కొత్త చిక్కులు వచ్చిపడ్డాయి. గత వార్షిక సంవత్సరంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేసిన, భూమి లేని నిరుపేదలను గుర్తించి రూ.12వేల ఆర్థిక సాయం అందించాలని సర్కార్ నిర్ణయించింది. ఇందులో భాగంగా మొదటి విడతగా రూ.6వేలు అందించింది. దీంతో గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేసేందుకు నిరుపేదలు ఆసక్తి కనబరుస్తున్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా జాబ్ కార్డులు అందించడం లేదు. గతంలో జాబ్ కార్డులు ఉండీ కొద్దిరోజులు పనులకు వెళ్లని వారి జాబ్‌కార్డులు ఇన్‌యాక్టివ్‌గా మారాయి. దీంతో తమ కార్డులు యాక్టివ్ చేయాలంటూ కూలీలు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు.

ఉపాధి హామీ లక్ష్యం నెరవేరేనా?

కేంద్రం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో అందరికీ పని కల్పించే పరిస్థితి లేదు. కొత్తగా జాబ్‌కార్డులు కూడా మంజూరు చేయకపోవడంతో నిరుపేద కూలీలకు పని దొరకక మళ్లీ వలసబాట పట్టే అవకాశం ఉంది. ప్రభుత్వం జాబ్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కొత్తగా ఇవ్వాలని, ఇన్‌యాక్టివ్ అయిన కార్డులను యాక్టివ్ చేసి ఉపాధి కల్పించాలని కూలీలు కోరుతున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలోని 21 మండలాల్లో 561 గ్రామ పంచాయతీల పరిధిలో జాతీయ ఉపాధి హామీ పథకం పనులు జరుగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 1.59 లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. వీటిలో 83 వేల కార్డులు మాత్రమే యాక్టివ్‌గా ఉన్నాయి. మిగతావి ఇన్‌యాక్టివ్ అయిపోయాయి. మొత్తంగా యాక్టివ్‌గా ఉన్న కార్డుల నుంచి 1.23 లక్షల మంది ఉపాధి పనుల్లో పాలుపంచుకుంటున్నారు.

సాయం కోసం ఎదురుచూపులు..

కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో భూమి లేని నిరుపేదలకు ఏడాదికి రూ.12వేల చొప్పున అందిస్తామని హామీ ఇచ్చింది. ఎన్నికల హామీలో భాగంగా ఆత్మీయ భరోసా పథకాన్ని ప్రవేశపెట్టింది. 2022–23 సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీల్లో భూమి లేనివారిని అర్హులుగా గుర్తించి ఆర్థిక సాయం చేసింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులకు డిమాండ్ పెరిగింది. గ్రామాల్లో ఉండే నిరుపేదలు కొత్తగా జాబ్‌కార్డుల కోసం, ఇన్‌యాక్టివ్ జాబ్ కార్డులను యాక్టివ్ చేయించుకొని ఉపాధి పనులకు వెళ్లేందుకు ఎదురుచూస్తున్నారు.

అధికారుల చుట్టూ తిరుగుతున్నా..



జాతీయ ఉపాధి హామీ పథకంలో 2022 సంవత్సరం వరకు పనులకు వెళ్లాను. తర్వాత వేరే పనులకు వెళ్తుండడంతో ఉపాధి పనులకు వెళ్లలేకపోయా. దీంతో జాబ్ కార్డు ఇన్‌యాక్టివ్ అయింది. మళ్లీ ఉపాధి పనులకు వస్తానని పంచాయతీ కార్యదర్శిని, మండల అధికారులను కలిసి జాబ్ కార్డు యాక్టివ్ చేయాల్సిందిగా తిరుగుతున్నా పని కావడం లేదు.

– అబ్బి రాజు, కూలీ, పాపిరెడ్డిగూడ, కేశంపేట మండలం

ఆప్షన్ రాగానే చేస్తాం..



నూతనంగా జాబ్‌కార్డులు మంజూరు కావడం లేదు. ఏప్రిల్ నుంచి కొత్త జాబ్‌కార్డులు ఇస్తామని చెప్పారు. కొత్త జాబ్ కార్డులతో పాటు ఇన్‌యాక్టివ్ కార్డుల యాక్టివ్ ప్రక్రియ నిలిపివేశారు. ఆప్షన్ వచ్చిన వెంటనే కొత్త జాబ్ కార్డులతో పాటు ఇన్‌యాక్టివ్ జాబ్ కార్డులను యాక్టివ్ చేస్తాం.

– రవిచంద్రకుమార్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ, కేశంపేట

పూలే స్మారక భవనం నిర్మాణానికి కృషి

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

రాజేంద్రనగర్: మహాత్మ జ్యోతిరావు పూలే స్మారక భవనంతో పాటు ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ వెల్లడించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ మహాత్మ జ్యోతిరావు పూలే జయంత్యోత్సవ కమిటీ అధ్యక్షుడు బండారి శంకర్ ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు పూలే కాంస్య విగ్రహంతో పాటు స్మారక భవనాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ప్రభుత్వ స్థలాన్ని మంజూరు చేసేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. కాంస్య విగ్రహం ఏర్పాటుతో పాటు స్మారక భవన ఏర్పాటు కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటానని వెల్లడించారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్, కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణమాచారి, మాజీ అధ్యక్షులు సత్యనారాయణ ముదిరాజ్, అడిగే అర్జున్, బంగి శ్రీను, మల్లికార్జున్ గౌడ్ పాల్గొన్నారు.

డీజే సౌండ్స్‌తో కోళ్లు చనిపోతున్నాయని ఫిర్యాదు

మొయినాబాద్: ఫాంహౌస్‌లలో రాత్రి వేళ డీజే సౌండ్స్ ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సురంగల్‌కు చెందిన సురేందర్ రెడ్డి శనివారం మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సురంగల్ గ్రామ సమీపంలోని బ్రిడ్జ్ ఫాం వెంచర్‌లో ఉన్న ఫాంహౌస్‌లో రాత్రి సమయంలో డీజేలతో హోరెత్తిస్తున్నారని.. దీంతో పక్కనే ఉన్న తమ పౌల్ట్రీ ఫాంలోని కోళ్లు భయంతో మృత్యువాత పడుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో కూడా ఇదే విషయమై ఫిర్యాదు చేయగా పోలీసులు పట్టించుకోలేదని ఆరోపించారు. ఆసారి స్పందించకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో షాపు దగ్ధం

మీర్‌పేట: వుడ్ వర్క్స్ షాపులో షార్ట్ సర్క్యూట్ జరిగి విలువైన సామగ్రి అగ్నికి ఆహుతైన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నాగరాజు కథనం ప్రకారం.. బడంగ్‌పేట వెంకటాద్రి కాలనీకి చెందిన కంచర్ల గౌరీశంకర్ దావుద్‌ఖాన్‌గూడలో తన బాబాయ్ కొత్తపల్లి బ్రహ్మాచారితో కలిసి సిసిరా వుడ్ వర్క్స్, వుడ్ కార్వింగ్ పేరిట షాపు నిర్వహిస్తున్నారు. రోజు మాదిరిగా శుక్రవారం రాత్రి షాపును మూసివేగా, 11.30 గంటలకు షాపులో షార్ట్ సర్క్యూట్ జరిగి రూ.20 లక్షల విలువైన సామగ్రి, షెడ్డు పూర్తిగా దగ్ధమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్మశానవాటికకు దారి లేదని శవయాత్ర అడ్డగింత

పూడూరు: శ్మశానవాటికకు దారిలేదని, శవాన్ని వెళ్లనిచ్చేది లేదని అడ్డుకున్న సంఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కుత్బుల్లాపూర్ గ్రామానికి చెందిన నస్కంటి బుగ్గయ్య మృతి చెందడంతో శనివారం అంత్యక్రియలు నిర్వహించేందుకు శ్మశానవాటికకు వెళ్తున్నారు. అదే ఊరికి చెందిన రవీందర్‌రెడ్డి దారి లేదని అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహించిన కుటుంబీకులు, బంధువులు శవాన్ని ట్రాక్టర్‌లో వేసుకుని కలెక్టర్ కార్యాలయానికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. స్థానిక ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి అడ్డుకుని సముదాయించారు. సదరు పట్టదారు రవీందర్‌రెడ్డితో మాట్లాడటంతో ఒప్పుకొని దారి వదలడంతో అంత్యక్రియలు నిర్వహించారు.

వర్ధంతి సభలు జయప్రదం చేయాలి

అనంతగిరి: ఉస్మానియా యూనివర్సిటీ పూర్వ విద్యార్థి నాయకుడు, కామ్రేడ్ జార్జిరెడ్డి 53వ వర్ధంతి సభలను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి రాజేశ్ కోరారు. ఈ మేరకు శనివారం వికారాబాద్‌లో ఆ సంస్థ ఆధ్వర్యంలో శనివారం వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్ధంతిని పురస్కరించుకుని ఆయన అమరత్వాన్ని విషాద జ్ఞాపకంగా కాకుండా మరో పోరాటానికి ఉత్తేజంగా మలుచుకోవాలన్నారు. అందుకోసమే ప్రత్యేక సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. అణగారిన విద్యార్థుల పక్షాన ఉండి పోరాటం చేసిన మహాయోధుడన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, సురేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర చీరల చోరీ ముఠా అరెస్టు

ఏడుగురి రిమాండ్..రూ.2 లక్షల విలువైన చీరలు, కారు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్

మియాపూర్: చీరలు కొనేందుకు షాపింగ్ మాల్స్‌కు వెళ్తూ చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా సభ్యులు ఏడుగురిని మియాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. పలుమార్లు జైలుకు వెళ్లి వచ్చినా తీరు మార్చుకోకుండా మళ్లీ చీరల చోరీలకు పాల్పడుతున్న ఈ ముఠా నుంచి రూ.2 లక్షల విలువ చేసే చీరలు, ఇక ఇన్నోవా కారును స్వాధీనం చేసుకుని శనివారం రిమాండ్‌కు తరలించారు. మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్,డీఐ రమేష్ నాయుడు కలిసి కేసు వివరాలు వెల్లడించారు. ఏపీలోని కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం తిరుపూర్ ప్రాంతానికి చెందిన వెంకటేశ్వరరావు, చౌటూరు గ్రామానికి చెందిన కట్ట యశోద, సద్దుపాటి తిరుపతమ్మ, వెంకటేశ్వరమ్మ, చట్రాయిమండలం జనరాద్రవార గ్రామానికి చెందిన రమణ అలియాస్ రావణక్క, విజయవాడ పటమట ప్రాంతానికి చెందిన దేరవకొండ సుభాషిణి, జగ్గయ్యపేట్‌కు చెందిన వెంకటేశ్వర్లు ఓ ముఠాగా ఏర్పడి పలు ప్రాంతాలలో చీరల దొంగతనాలకు పాల్పడుతుండేవారు. ఈ ముఠాలో సుమారు 50 నుంచి 100 మంది సభ్యులున్నట్లు తెలిపారు. వీరు గ్రూపులుగా ఏర్పడి 30 సంవత్సరాల నుంచి చీరల దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇన్నోవా కారులో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని వివిధ జిల్లాలు, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోనూ తిరుగుతూ తక్కువ ఉద్యోగులు ఉన్న షాపింగ్ మాల్స్, ఇళ్లల్లో చీరల వ్యాపారం నిర్వహించే వారిని టార్గెట్ చేసుకుంటారు. నిర్వాహకులు దృష్టి మరల్చి చీరలు దొంగిలిస్తారు. ప్రతి నెలా 5 నుంచి 8 దొంగతనాలకు పాల్పడతారు.

దొంగతనం తర్వాత మొక్కులు చెల్లిస్తారు

దొంగిలించిన చీరలను తీసుకుని వీరు కారులో యాదగిరిగుట్ట, ఇతర దేవాలయాలకు వెళ్తుంటారు. అక్కడ దేవుడికి మొక్కులు చెల్లించుకుని అనంతరం విజయవాడకు వెళ్లి కనకదుర్గమ్మ దేవాలయం ముందు, బస్టాప్, సంతల్లో, రద్దీ ప్రదేశాల్లో ఒక్కో చీరను రూ.2 వేల నుండి 10వేల వరకు అమ్ముతుంటారు. అమ్మగా వచ్చిన డబ్బులను ముఠా సభ్యులు పంచుకుంటారు. కాగా చీరల దొంగతనం చేసే ముఠా సభ్యులపై పదుల సంఖ్యలో కేసులున్నాయి. అనేక సార్లు అరెస్ట్ అయి జైలుకు కూడా వెళ్లివచ్చారు. అయినా వీరు దొంగతనాలు మానలేదని చెప్పారు.

మియాపూర్ పోలీసులకు ఇలా పట్టుబడ్డారు

గత 28వ తేదీన మియాపూర్‌లోని ఫ్రెండ్స్ కాలనీలో ఈ ముఠా సభ్యులు వెంకటేశ్వరరావుతో పాటు మహిళలు చీరల షాపుకు వెళ్లారు. షాపు నిర్వహించే మహిళ బయటకు వెళ్లడంతో ఆమె భర్త వచ్చిన వారికి చీరలు చూపించాడు. చీరలు చూస్తూ యజమాని దృష్టి మరల్చేందుకు నీళ్లు కావాలని అడిగారు. దీంతో యజమాని ఇంట్లోకి వెళ్లి వాటర్ తీసుకువచ్చేలోపు మరికొంత మంది మహిళలు చీరలు దొంగిలించారు. కొద్దిసేపు చీరలు చూసి మళ్లీ వస్తామని చెప్పి వెళ్లిపోయారు. కొద్దిసేపటికి షాపు నిర్వాహకురాలు ఇంటికి వచ్చి పరిశీలించగా 14 చీరలు కనిపించలేదు. దీంతో మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 3వ తేదీన ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు ముఠా సభ్యులను అదుపులోకి తీసుకుని విచారించగా చోరీకి పాల్పడింది తామేనని ఒప్పుకున్నారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక యువకుడి ఆత్మహత్య

మణికొండ: పనిచేస్తున్న ఉద్యోగం పోవటం, ఆర్థిక ఇబ్బందులు, మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్‌లో శనివారం జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... ప్రతి సతీష్‌కుమార్(27) తన తల్లి భారతితో కలిసి అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 13లో నివసిస్తున్నాడు. అతను గతంలో హెటిరో ఫార్మాలో గ్రాఫిక్ డిజైనర్‌గా పనిచేశాడు. అక్కడ గొడవలతో ఉద్యోగానికి రాజీనామా చేశాడు. ఆర్థిక ఇబ్బందులు ఎదురుకావటం, మద్యానికి బానిస కావటంతో అతని జీవితంలో నిరాశ నిండిపోయింది. రాపిడో డ్రైవర్‌గా పనిచేస్తున్నా ఆ ఆదాయం ఏమాత్రం సరిపోలేదు. శుక్రవారం రాత్రి తల్లిని తన చేతులతో అన్నం తినిపించాలని కోరాడు. అంతలోనే మనసు మార్చుకుని తినకుండానే తన గదిలో పడుకున్నాడు. శనివారం మధ్యాహ్నం వరకు అతను నిద్ర లేవకపోవటం, పిలిచినా పలకక పోవటంతో అదనపు తాళం చెవితో గది తెరచి చూడగా అతను ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు.

రూ.60 లక్షల గంజాయి పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: వివిధ చోట్ల జరిపిన దాడుల్లో ఎక్సైజ్ అధికారులు రూ.60 లక్షల విలువైన 75.262 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నాలుగు చోట్ల కేసులు నమోదు చేశారు. ఒక కారు, స్కూటీ, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా నుంచి కారులో పూణేకు తరలిస్తున్న 51.27 కేజీల గంజాయిని ఖమ్మం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఒడిశా నుంచి హైదరాబాద్‌కు తరలించిన మరో 21.48 కిలోల గంజాయిని ధూల్‌పేట్‌కు సరఫరా చేస్తుండగా ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. మరో రెండు కేసుల్లో 2.51 కిలోల గంజాయితో పాటు 2.42 గ్రాముల చెరస్‌ను పట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. ఒడిశా నుంచి బినా చెప్పల్ అనే వ్యక్తి దగ్గర నుంచి ధూల్‌పేట్‌కు చెందిన భార్యాభర్తలు బడా చందర్‌పాల్‌సింగ్, గాయత్రి భాయ్‌లు కలిసి ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా పట్టుకున్నారు. ఈ కేసులో భార్యాభర్తలను అరెస్ట్ చేయడంతో పాటు మరో 13 మందిపై కేసులు నమోదు చేశారు. అలాగే ఖైరతాబాద్ సమీపంలో ఆకాష్ అనే వ్యక్తి నుంచి 1.26 కిలోల గంజాయి, 2.42 గ్రాముల చెరస్‌ను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేశారు.

క్యాబ్ డ్రైవర్ నిజాయితీ

మహిళకు బంగారు గొలుసు అప్పగింత

అత్తాపూర్: క్యాబ్‌లో మరిచిపోయిన బంగారు గొలుసును ప్రయాణికురాలికి తిరిగి అప్పగించామని అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. పోలీసుల సమాచారం మేరకు... అత్తాపూర్ జలాల్‌బాబానగర్‌కు చెందిన షమీనాబేగం(27) బాలానగర్ నుంచి ఊబెర్ క్యాబ్‌లో శనివారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి జలాల్‌బాబానగర్‌కు చేరుకుంది. నాలుగున్నర తులాల బంగారు నెక్లెస్ ఉన్న హ్యాండ్ బ్యాగ్‌ను క్యాబ్‌లో మరచిపోయారు. వాహనదారుడు మైపాల్ ఊబెర్ క్యాబ్ డ్రైవర్‌గా గుర్తించారు. అత్తాపూర్ పోలీసులు క్యాబ్ డ్రైవర్‌ను ఫోన్‌లో సంప్రదించగా తన క్యాబ్‌లోనే ఉన్న హ్యాండ్‌బ్యాగ్‌ను పోలీసుల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా క్యాబ్ డ్రైవర్ మహిపాల్‌ను ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు అభినందించారు.

జూబ్లీహిల్స్ క్లబ్‌పై తప్పుడు ప్రచారం సరికాదు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ (జేఐసీ)లో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తున్నారని వచ్చిన వార్తల్లో ఏమాత్రం వాస్తవం లేదని కార్యదర్శి కిలారు రాజేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. క్లబ్‌లో శిథిలమైన వాటిని సరిజేయడం తప్పితే, నిబంధనలకు విరుద్ధంగా ఏ నిర్మాణాలు చేయడం లేదని చెప్పారు. జీహెచ్ఎంసీకి తాము అన్ని వివరాలు అందించామని, క్లబ్‌తో సంబంధం లేని వ్యక్తులు క్లబ్ ప్రతిష్టతో పాటు మొత్తం సభ్యులను ఇబ్బంది పెట్టేందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఇక్కడ ఏం చేసినా సభ్యులు సౌకర్యాల కోసమేనని, కొత్త నిర్మాణాలు చేపడితే జీహెచ్ఎంసీ అనుమతులు తీసుకునే ఆనవాయితీ క్లబ్‌కు ఉందన్నారు. తప్పుడు ప్రచారం చేసే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

నినదించి.. హోరెత్తించి


సభలో మాట్లాడుతున్న చిలుకూరు బాలాజీ దేవాలయ అర్చకుడు రంగరాజన్

శోభాయమానంగా వీర హనుమాన్ శోభాయాత్ర

మొయినాబాద్: రామ లక్ష్మణ జానకీ.. జై బోలో హనుమాన్‌కీ అంటూ వీర హనుమాన్ శోభాయాత్ర వైభవోపేతంగా కొనసాగింది. శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు బాలాజీ దేవాలయం నుంచి మొయినాబాద్ శివాలయం వరకు భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. ఇందులో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంతో నృత్యాలు చేశారు. మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలో ఏర్పాటు చేసిన సభలో ఆధిత్య పరాశ్రీ స్వామి, చిలుకూరు బాలాజీ దేవాలయ అర్చకుడు రంగరాజన్ పాల్గొని ప్రసంగించారు. హిదూ ధర్మాన్ని రక్షించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు గున్నాల గోపాల్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నాయకులు శ్రీరాములు, నరేందర్, రాజు, గణేష్, రాజమల్లేష్, శ్రీకాంత్, భజరంగ్‌దళ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధి పొందాలి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి


మహిళలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

హయత్‌నగర్: మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు స్వయం ఉపాధి సరైన మార్గమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. తుర్కయాంజాల్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ వేముల స్వాతి అమరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కుట్టు మిషన్, బ్యూటీషియన్ శిక్షణ పూర్తి చేసుకున్న సుమారు 200 మంది మహిళలకు శనివారం తొర్రూర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆయన సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలకు శిక్షణ ఇచ్చి వారి కాళ్లపై వారు నిలబడేలా చేయడం అభినందనీయమన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అతివలు మరొకరికి మార్గదర్శకంగా నిలవాలని, ఒకరికొకరు చేయూతనందించుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ యాదిరెడ్డి, నాయకులు బలవంతరెడ్డి, ధన్‌రాజ్‌గౌడ్, రమేశ్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, కుమార్‌గౌడ్, బుచ్చిరెడ్డి, లక్ష్మణ్, బాల్‌రాజ్‌గౌడ్, పాండు, మధుసూదన్‌రెడ్డి, పోచయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పూజల పేరిట మోసాలు నకిలీ బాబా అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బాలస్వామి

కాచిగూడ: 'మీ జాతకం బాగాలేదు..శాంతి పూజలు చేయాలి' అంటూ ఓ మహిళకు మాయమాటలు చెప్పి అందిన కాడికి బంగారం, నగదుతో ఉడాయించిన బురిడీ బాబాను కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ జె.నర్సయ్యతో కలిసి డీసీపీ డాక్టర్ బాలస్వామి వివరాలు వెల్లడించారు. ఎల్‌బీ నగర్‌లోని రాక్ టౌన్ కాలనీకి చెందిన ఆంజనేయులు కుమారుడు అరిగెల సాంబశివుడు (45) అలియాస్ గురూజీ శివస్వామి వృత్తిరీత్యా ప్రైవేట్ ల్యాండ్ సర్వేయర్. ఈజీగా డబ్బులు సంపాదించాలనే ప్లాన్‌తో దొంగబాబా అవతారం ఎత్తాడు. తిలక్‌నగర్ ప్రాంతానికి చెందిన గీతా వైద్య దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ కాలేజీలో రిసెప్షనిస్ట్‌గా పనిచేస్తోంది. సంవత్సరం క్రితం ఆమె భర్త చనిపోయాడు. ఈ క్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సౌమ్య ద్వారా గీతకు సాంబశివుడు పరిచయమయ్యాడు. మీ ఇంటికి దోషం ఉందని, మీ పేరు మీద బాగాలేదని ముందు ముందు చాలా ఇబ్బందులు పడతారని, మీ భర్త చనిపోయినట్లే మీ కుటుంబం అంతా చనిపోతారని భయపెట్టాడు. దోషం పోవాలంటే పూజలు చేయించాలని, ఇందుకు రూ.1.70 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పి ఆమె దగ్గర డబ్బులు తీసుకున్నాడు. అనంతరం కొద్దిరోజులకు మళ్లీ మీ కూతురికి పెళ్లయితే విడాకులు అవుతాయని, అందుకు దోష నివారణకు పూజలు చేయాలని, దానికి లక్షలు ఖర్చు అవుతుందని మాయమాటలు చెప్పాడు. దీంతో భయపడిన గీత తన దగ్గర ఉన్న 26 తులాల బంగారు నగలు ఇచ్చింది. అదే కాకుండా ఆమె ఇంటి పత్రాలను కూడా ఇచ్చింది. ఈ దశలో అనుమానం వచ్చిన గీతా వైద్య కూతురు ప్రతిఘటించి దొంగ బాబా దగ్గర ఇంటి పత్రాలను తిరిగి తీసుకున్నారు. అనంతరం కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న కాచిగూడ పోలీసులు సాంబశివుడిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 20 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ప్రజలు ఇలాంటి బురిడీ బాబాల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీసీపీ సూచించారు.

54 అడుగుల హనుమాన్ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ

శంషాబాద్: పట్టణంలోని సిద్ధాంతి హనుమాన్ దేవాలయం ప్రాంగణంలో 54 అడుగుల ఎత్తైన హనుమాన్ విగ్రహ ఏర్పాటుకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ భూమి పూజ చేశారు. అంతకుముందు హనుమాన్ జయంతి సందర్భంగా మాజీ కౌన్సిలర్ మేకల వెంకటేష్ ముదిరాజ్, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే స్వాగతం పలికారు. వివిధ రకాల పండ్లతో ఆంజనేయ విగ్రహానికి అలంకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ధైర్యంగా ఉండి పోరాడేందుకు హనుమంతుడే మనకు స్ఫూర్తి అన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ సర్పంచ్ ఆర్.గణేష్‌గుప్తా, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్, వెంకటేష్‌గౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ప్రేమ్‌రాజ్, ఆలయ కమిటీ సభ్యులు యాదగిరి, సతీష్, సుధాకర్, హనుమంతు, సురేష్, కన్నయ్య, శస్త్రఖర్, హరినాథ్, సిద్ధులు, కృష్ణ, సురేష్, యాదగిరి, కృష్ణం రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.